క్లుప్తంగా

బోరు, మోటారు విడిపరికరాలు సిద్ధం



విడి పరికరాలను గదిలో భద్రపరుస్తున్న ఎంపీపీ, అధికారులు

రావికమతం: వేసవిలో ఏ గ్రామంలోనూ తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా చూసేందుకు రూ.12 లక్షలతో అవసరమైన బోర్లు, మోటార్ల విడి పరికరాలు సిద్ధంగా ఉన్నాయని ఎంపీపీ పైల రాజు, ఎంపీడీవో వెంకన్నబాబు తెలిపారు. బుధవారం వీటిని స్థానిక జలవనరుల శాఖ గదిలో భద్రపరిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి దృష్ట్యా పలు గ్రామాల్లో బోర్లు ఇంకిపోతుండటం, త్వరగా మరమ్మతులకు గురవ్వడం నేపథ్యంలో 24 గంటల్లో అటువంటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. గ్రామాల్లో కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

తక్షణ సాయం అందజేత



నగదు అందిస్తున్న సర్పంచ్ సన్యాసినాయుడు, ఎంపీటీసీ రామునాయుడు

కె.కోటపాడు: సూదివలస గ్రామానికి చెందిన కూండ్రపు దేముడు భార్య నళినికి తక్షణ సాయంగా సర్పంచ్ ఆదిరెడ్డి సన్యాసినాయుడు, ఎంపీటీసీ వర్రి రామునాయుడు రూ.10 వేలు బుధవారం అందించారు. ఈ నెల 12న సహజ మరణం చెందిన దేముడుకు వైఎస్సార్ బీమా కింద మిగిలిన రూ.90 వేలు నామినీ బ్యాంకు ఖాతాలో జమకానున్నట్లు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రేవతి తెలిపారు. ఉప సర్పంచ్ వర్రి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు కామేశ్వరమ్మ పండగ



విద్యుద్దీపాలంకరణలో అమ్మవారి ఆలయం

మాకవరపాలెం: రాచపల్లి జంక్షన్‌లో వెలసిన కామేశ్వరమ్మతల్లి పండగను గురువారం భారీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి విద్యుత్ దీపాలంకరణ ఏర్పాటు చేశారు. పండగ రోజు రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది.

మరుపాకలో 'గడప గడపకు' నేడు

రావికమతం: మరుపాక పంచాయతీ శివారు దాసరయ్యపాలెం, గొల్లలపాలెం, నాగన్నపాలెం, రాయవరం గ్రామాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వెంకన్నబాబు బుధవారం తెలిపారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఈ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకుంటారన్నారు. అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉదయం 6 గంటలకే హాజరు కావాలని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



అవగాహన కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది, చిరికి శ్రీనివాసరావు

దేవరాపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని వైఎస్సార్ టీచర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చిరికి శ్రీనివాసరావు తెలిపారు. చింతలపూడి పంచాయతీ శివారు వంతెవానిపాలెంలో అనంతగిరి అటవీ శాఖ రేంజ్ పరిధి అధికారులు బుధవారం లైఫ్ పేరిట చేపట్టిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ డి. సత్యం మాట్లాడుతూ మొక్కలు నాటడం, నీటిని ఆదా చేయడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం తదితర అంశాలను పాటించాలన్నారు. అటవీశాఖ బీట్ ఆఫీసర్లు ఐ.రాంబాబు, ప్రదీప్, డేవిడ్, సమ్మెద బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి దుక్కులు.. ఎంతో మేలు!

- పెరిగిన దుక్కుటెద్దుల వినియోగం
- నేల గుల్లబారి భూమి సారవంతం
- అధిక దిగుబడులకు అవకాశం



గాదిరాయిలో పశువులతో దుక్కు చేస్తున్న రైతు

మాడుగుల: సేద్యంలో అధునాతన యంత్రాల వినియోగంతో పని వేగంతోపాటు ఖర్చు ఆదా తగ్గుతోంది. ఈ నేపథ్యంలో సంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలికిన రైతులు మరలా అటువైపే దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుతం వేసవి దుక్కులకు దుక్కుటెద్దుల వినియోగం పెరిగింది. దుక్కుటెద్దుల నాగలితో నేల కలయ దున్నడం వల్ల సాళ్లు లోతవుతాయి. నేల గుల్లబారి సారవంతమవుతుంది. మండలంలో 250 మంది రైతులు పశువులతోనే దుక్కులు చేస్తున్నారు. ఈ ఏడాది మూడు వేల ఎకరాల్లో వేసవి దుక్కులు దున్నుతున్నారు. ఇటీవల వర్షాలు అనుకూలించడం వల్ల ఈ పనులు వేగం అందుకున్నాయి.

వేసవి దుక్కితో కలిగే లాభాలు...

- వేసవికాలంలో దుక్కులు దున్నితే రైతులు పంట కోత అనంతరం పొలాన్ని అలా ఖాళీగా వదిలేస్తుంటారు. దీంతో తొలకరి వానలు పడగానే నీరు భూమిలోకి ఇంకిపోకుండా బయటకు పోతోంది. వర్షాలకు ముందే భూమిని కలియ దున్నడం వల్ల తొలకరి వర్షాలు నీరు భూమిలోకి ఇంకుతోంది. భూమి కోతకు గురికాకుండా ఉంటుంది.
- లోతు దుక్కులతో భూమి పైపొరలు కిందికి, కింద పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుంది. ఇలా భూమిలో తేమ శాతం పెరిగి, భూసారం అభివృద్ధి, పురుగులు, తెగుళ్ల యాజమాన్యం, కలుపు మొక్కల నివారణ వగైరా ప్రయోజనాలు సమకూరుతాయి.
- వేసవి దుక్కులు దున్నే ముందు పశువుల పెంట పోగు, కంపోస్టు, మట్టిని వెదజల్లడం ద్వారా సారవంతమైన పంట దిగుబడితోపాటు తేమశాతం పెరుగుతుంది.

పుష్కలంగా భూసారం

వేసవి దుక్కులు లోతుగా, వాలుగా, అడ్డంగా దున్నుకోవాలి. వాలుకు అడ్డంగా దున్నుకోవడం వల్ల వాన నీరు భూమిలోకి ఇంకేందుకు అనుకూల పరిస్థితి ఏర్పడుతుంది. భూమి కూడా ఎక్కువ తేమను గ్రహించి చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. వేసవి దుక్కులు దున్నేముందు పొలంలో గొర్రెలు, పశువుల మందలు తోలడం వల్ల అవి విసర్జించిన వ్యర్థాలు భూమిలోకి చేరి సేంద్రియ పదార్థం తయారవుతుంది. ఫలితంగా భూసార వృద్ధిలో ఎంతగానో ఉపయోగపడుతుంది. సాధారణంగా రైతులు పంట చేతికందగానే పంటల నుంచి వచ్చే ఎండు ఆకులు, చెత్త కాల్చివేయకుండా అవకాశమున్న వారు లోతు దుక్కులు చేయడం మూలంగా పంట చెత్తాచెదారం, ఎండాకులు నేల పొరల్లో కలిసిపోయి ఎరువుగా మారి భూసారం పెరుగుతుంది. పంటకు కావాల్సిన పోషక పదార్థాలు పుష్కలంగా లభిస్తాయి.

చీడపీడలు నశిస్తాయి

వేసవిలో చాలా వరకు భూమి ఖాళీగా ఉంటుంది. అలాంటి సమయంలో పంటలను ఆశించే అనేక రకాల పురుగులు పంటకోత దశల్లో వాటి నిద్రావస్థ దశలను నేల, చెత్తా చెదారం, కొయ్యకాడల్లో గడుపుతాయి. తెగుళ్లను కలుగజేసే శిలీంధ్రాలు తదితరమైనవి భూమి లోపల ఆశ్రయం పొందుతాయి. వీటి శిలీంధ్ర బీజాలు భూమిలో నిల్వ ఉంటాయి. వేసవి లోతు దుక్కుల వల్ల నిద్రావస్థ దశలో భూమిలోని చీడపురుగుల కోశాలు, గుడ్లు, లార్వాలు, గుడ్లను, పక్షులు, కొంగలు, కాకులు తిని వాటిని నాశనం చేస్తాయి. అదే విధంగా వేసవి దుక్కుల వల్ల భూమిలోపల పొరల్లో ఉన్న శిలీంధ్ర బీజాలు మట్టితోపాటు నేలపైకి వస్తాయి. బయట అధిక ఉష్ణోగ్రతలకు అవి చనిపోతాయి.

వేసవి దుక్కులతో అధిక దిగుబడులు



ఏటా నాకున్న భూములను వేసవి దుక్కులు దున్నిస్తాను. దీనివల్ల కలుపు ఎండకు నశిస్తాయి. తొలకరిలో వేసే పంటకు కలుపు బెడద ఉండదు. భూమి గుల్లబారి వేసిన పంటలు ఏపుగా ఎదుగుతున్నాయి. అధిక దిగుబడులు వస్తున్నాయి.

– పాలిమేర చిన్నారావు, రైతు మాడుగుల

వేసవి దుక్కులపై అవగాహన



పొలంబడి కార్యక్రమంలో రైతులకు వేసవి దుక్కులపై అవగాహన కల్పిస్తున్నాం. పశువులతో లోతుగా దుక్కు చేయడం వల్ల భూమి గుల్లబారి సారవంతంగా మారుతుంది. క్రిమిసంహారక మందులు ఖర్చు ఆదా అవుతుంది. ఎరువులు పెద్దగా వాడనవసరం లేదు. రైతులు తప్పనిసరిగా వేసవి దుక్కులు చేసుకోవాలి.

– ఎం. వాసుదేవరావు, వ్యవసాయాధికారి, మాడుగుల

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలు

నాలుగు గ్రామాల్లో పర్యటించిన జెడ్పీటీసీ అనురాధ



ప్రజలతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ అనురాధ

కె.కోటపాడు: మండలంలోని మర్రివలస, శృంగవరం, గొట్లాం, పాతవలస గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ ఎలక్ట్రికల్ అధికారులకు సూచించారు. మంగళవారం సాయంత్రం గాలివాన బీభత్సంతో ఆయా గ్రామాల్లో 19 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యాయి. బుధవారం ఉదయాన్నే ఆమె ఆయా గ్రామాల్లో పర్యటించి పరిశీలించారు. ఈ మేరకు ఎలక్ట్రికల్ పనులను పూర్తి చేసి గ్రామానికి విద్యుత్ సరఫరా అందించినట్లు ఎలక్ట్రికల్ ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. సర్పంచ్‌లు పొంతపల్లి అప్పలనర్సమ్మ, ద్వారపూడి శ్రీను, పొంతపల్లి రవినాయుడు, మాజీ ఎంపీటీసీ కోటాన సూరిదేముడు, గండి ఈశ్వరరావు, గంతకర్ల చిన్నమ్ములు పాల్గొన్నారు.

పల్సర్ బైక్, 60 లీటర్ల సారా స్వాధీనం

- నిందితుడు పరారీ



పోలీసులు స్వాధీనం చేసుకున్న సారా, బైక్

రావికమతం: ఆర్.కొత్తూరులో కొత్తకోట పోలీసులు బుధవారం దాడి చేసి 60 లీటర్ల సారా, పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ విభీషణరావు వివరాల మేరకు... గ్రామ శివారులో సారా అమ్ముతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. గ్రామ శివారు పొలాల వద్ద వారు దాడి చేయగా నిందితుడు పరారయ్యాడు. అక్కడ పల్సర్ బైక్, రెండు క్యాన్లు, 60 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

145 మందికి నేత్ర వైద్య పరీక్షలు

బుచ్చెయ్యపేట: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా బుధవారం మంగళాపురంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ కంటే పద్మరేఖ వెంకట్ ఈ శిబిరాన్ని ప్రారంభించగా, 145 మంది రోగులను విశాఖ ప్రభుత్వ ఐ ఆస్పత్రి వైద్య సిబ్బంది పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కుముదాంపేట, దిబ్బిపాలెం, మంగళాపురం, పేట తదితర గ్రామాల రోగులు వచ్చి వైద్య సేవలు పొందారు. కంటి సమస్యలున్న 45 మందిని గుర్తించి ఆపరేషన్లు, కళ్లద్దాల పంపిణీకి ఎంపిక చేశారు. ఏఎన్ఎం, వైద్య సిబ్బంది, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రూ.272 కూలి పొందేలా ఉపాధి



వేతనదారులకు టోపులు, వేలిముద్రణ బాక్స్, మజ్జిగను అందిస్తున్న ఎంపీడీవో శచీదేవి



దాలింపేటలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో



నిండుగొండలో కూలీల సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీడీవో ప్రభాకరరావు

కె.కోటపాడు: గ్రామాల్లో ఉపాధి పనుల ద్వారా రోజువారి గరిష్ట వేతనం రూ.272 పొందేటట్లు పని చేయాలని వేతనదారులకు ఎంపీడీవో కె.శచీదేవి సూచించారు. మండలంలో చౌడువాడ, ఆర్లి, గుల్లేపల్లి గ్రామాల్లో ఉపాధి పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పని ప్రాంతాల్లో వీఆర్పీలు మంచినీరు, నీడను కల్పించేందుకు షామియానాలు వేయాల్సిందిగా సూచించారు. వేసవి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడం వల్ల ఉదయం 5.30 నుంచి 10.30 గంటల వరకు పనులు చేయాలన్నారు. పాచిలవానిపాలెంలో ఆరు గ్రూపుల వేతనదారులకు వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ సమకూర్చిన కొలత టేపులు, వేలిముద్రణ పెట్టెలు, పెన్నులు, మజ్జిగను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, ఎంపీడీవో పంపిణీ చేశారు. ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు ఆకుల సాయి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఎన్. రామునాయుడు, వీఆర్పీ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పనిప్రదేశాల్లో తాగునీరు, టెంట్లు తప్పనిసరి

మాకవరపాలెం: ఉపాధి పనులు జరిగే ప్రాంతాల్లో టెంట్లు, తాగునీరు తప్పనిసరిగా ఉంచాలని ఎంపీడీవో అరుణశ్రీ ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని తామరం, జి.గంగవరం, దాలింపేటలో ఉపాధి పని ప్రదేశాల్లో కూలీలకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ పనుల వద్ద తాగునీరు, టెంట్లు ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. నిరంతరం ఉపాధి పనులపై తనిఖీలు చేస్తామన్నారు. టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల వద్ద మౌలిక సదుపాయాలు

రోలుగుంట: ఉపాధి పనుల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించి, ఫస్ట్ ఎయిడ్ విధిగా ఏర్పాటు చేయాలని ఎన్ఆర్ఈజీఎస్ ఉద్యోగులను ఎంపీడీవో కె.ప్రభాకరరావు ఆదేశించారు. నిండుగొండలో పినపోతుల వారి చెరువు పనులు, ఎన్.కొత్తూరులో మొగలబంద చెరువు పనులను పరిశీలించారు. కూలీల సమస్యలు తెలుసుకున్నారు. టెంట్, తాగునీరు, చలువ పందిర్లు, ఫస్ట్ ఎయిడ్ (వైద్య) ఏర్పాట్లపై టెక్నికల్ అసిస్టెంట్లు బంటు రాము, దినేష్‌తో చర్చించారు. ప్రధానంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచి పంచాలని సూచించారు.

రక్షణ సంచులతో మేలు



రక్షణ సంచులను పంపిణీ చేస్తున్న ఉద్యాన అధికారి రాధిక

మాకవరపాలెం: మామిడి రక్షణ సంచులతో పురుగుమందుల వాడకాన్ని తగ్గించొచ్చని ఉద్యానశాఖ అధికారి జి.రాధిక రైతులకు సూచించారు. బుధవారం జి.కోడూరులో మామిడి తోటల సంరక్షణ, సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ తోటబడి కార్యక్రమంలో 50 శాతం రాయితీపై మామిడి కాయల రక్షణ సంచులను ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. రైతులకు ఈ సంచులను పంపిణీ చేశారు. రాయితీపై ఉద్యాన రైతులకు అందించే పథకాలను వివరించారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు, అధిక ఆదాయం పొందే మార్గాలపై దృష్టి సారించాలని సూచించారు. అనకాపల్లి ఉద్యాన క్షేత్రంలో మామిడి, జీడి అంటు మొక్కలు అందుబాటులో ఉంచామన్నారు. ఏవో చిరంజీవి మాట్లాడుతూ డ్రోన్ల ద్వారా పురుగు మందుల పిచికారీ, తదితర కార్యక్రమాలను వివరించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు వెలగా రమణ, వైఎస్సార్‌సీపీ నేత బొడ్డేటి వెంకటరమణ, ఉద్యాన సిబ్బంది, తదతరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ విత్తనాలు, ఎరువులకు ప్రణాళిక

నాతవరం: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తనాలు, ఎరువులు సమస్య లేకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి తెలిపారు. ఆయన బుధవారం స్థానిక ఆర్బీకేలో వ్యవసాయ సిబ్బందితో మాట్లాడారు. తాండవ రిజర్వాయరులో నీటి మట్టం నిలకడగా ఉందని, అధికారులు సకాలంలోనే నీటిని ఆయకట్టుకు విడుదల చేసే అవకాశం ఉందన్నారు. అందువల్ల విత్తనాలు, ఎరువులు సాగు లక్ష్యాన్ని తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఖరీఫ్ ప్రణాళికను ఏవో శైలజ వివరించారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

రోలుగుంట: కె.నాయుడుపాలెంలో ఉపాధి కూలీలకు బుధవారం పంచాయతీ కార్యదర్శి లాలం శివ మజ్జిగ ప్యాకెట్లను సరఫరా చేశారు. ఈ సందర్భంగా వేసవి దృష్ట్యా వీటిని అందజేశామన్నారు. ఉదయం ఆరు గంటలకు వచ్చి 10 గంటలకే పని ముగించుకోవాలని వేతనదారులకు ఆయన సూచించారు.

వైఎస్సార్‌సీపీ నేత చొరవతో తాగునీరు సరఫరా



ట్యాంకర్‌తో నీరు సరఫరా చేస్తున్న రాజు

రావికమతం: వైఎస్సార్‌సీపీ నాయకుడు సోమిరెడ్డి రాజు మానవతా దృక్పథంతో కొత్తకోట గ్రామస్తులకు ట్యాంకర్‌తో తాగునీటి సరఫరా చేశారు. వారం రోజులుగా గ్రామంలో మంచినీటి సరఫరా చేసే వాల్వ్ పని చేయలేదు. అది సరిచేశాక ట్యాంకు వద్ద సాంకేతిక లోపం, విద్యుత్ సమస్య తలెత్తింది. మరోపక్క ఎండలు మండిపోతుండటంతో తాగునీటికి కటకటలాడుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సోమిరెడ్డి రాజు, ధనలక్ష్మి దంపతులు బుధవారం నుంచి ట్యాంకర్‌తో మంచినీరు తీసుకువచ్చి 11వ వార్డు నుంచి సరఫరా ప్రారంభించారు. ఎంతో మంది దాతలను కోరుతున్నా స్పందించలేదని, రాజు దంపతులు ముందుకు వచ్చి నీరు సరఫరా చేయడంతో మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. శాలువా కప్పి సన్మానించారు.

సహకార సంఘం బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ఎన్నిక



పాలకవర్గ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న ఏపీఎం పార్వతీబాయి

నర్సీపట్నం: మండల స్థాయి రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ఎన్నిక స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బుధవారం జరిగింది. ఏపీఎం ఎస్.పార్వతీబాయి ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో 15 మందిని డైరెక్టర్లుగా ఎన్నుకున్నారు. వీరిలో ఐదుగురిని పాలకవర్గం సభ్యులు ఎన్నుకున్నారని ఏపీఎం తెలిపారు. అనంతరం వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో భాగంగా రైతు ఉత్పత్తి సంఘాల ఉద్దేశం, చేయు కార్యక్రమాలు గురించి ఏపీఎం వివరించారు. మండల సమాఖ్య సభ్యులు, అధ్యక్షులు, సీసీ రాజశేఖర్, రామలక్ష్మి, బి.జగదీష్ పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలు బలోపేతం చేసుకోవాలి



మాట్లాడుతున్న వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ సత్యనారాయణ

రోలుగుంట: వెలుగు ద్వారా పొందిన రుణాలను ప్రతి నెలా 15వ తేదీలోపు జమ చేసుకుని తమ సంఘాలను బలోపేతం చేసుకోవాలని వెలుగు నర్సీపట్నం ఏరియా కో-ఆర్డినేటర్ సత్యనారాయణ తెలిపారు. ఏపీఎం కె.సాధన అధ్యక్షతన స్థానిక స్త్రీశక్తి భవన్‌లో బుధవారం మండల, గ్రామ స్థాయి సామాజిక కార్యకర్తలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా కో-ఆర్డినేటర్ మాట్లాడుతూ స్త్రీనిధి, సామాజిక పెట్టుబడులు, ఉన్నతి తదితర పథకాల ద్వారా రుణాల మంజూరు, ఏ విధంగా జమ చేస్తే సంఘాలు అభివృద్ధి చెందుతాయి, రుణార్హతలపై వివరించారు. స్త్రీనిధి మేనేజర్ కనకమహాలక్ష్మీ, ఏరియా సామాజిక కార్యకర్తలు నాగేశ్వరరావు, పద్మ, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

పశుపోషణ లాభదాయకం

- పశుసంవర్ధక శాఖ ఏడీ భైరాగి



సింగన్నదొరపాలెంలో పాడి రైతులతో మాట్లాడుతున్న ఏడీ భైరాగి

కె.కోటపాడు: ఆడపెయ్యిలను వృద్ధి చేయడం ద్వారా పాడి రైతులకు పశుపోషణ లాభదాయకంగా ఉంటుందని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.భైరాగి తెలిపారు. పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో భాగంగా బుధవారం సింగన్నదొరపాలెంలో పాడి రైతులకు పశు పోషణలో సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏడీ భైరాగి మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యం ద్వారా ఆడపెయ్యిలకు జన్మనివ్వవచ్చునని సూచించారు. దీన్ని తక్కువ ధరకే రైతులకు అందిస్తున్నట్టు తెలిపారు. వీటితో పాటు రాయితీపై సమీకృత దాణా, కాకిజొన్న రకం గడ్డి విత్తనాలను ఆర్బీకేల్లో పొందాలని సూచించారు. వేసవి ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడంతో రోజూ రెండుపూటలా పశువులను నీటితో శుభ్రపర్చాలని తెలిపారు. ఉదయం 9 లోపు, సాయంత్రం 4 గంటల తర్వాత పశువులను ఆరుబయటకు మేతకు తీసుకెళ్లాలని వివరించారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకుడు బుచ్చిబాబు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు'

- ఖండివరంలో ఇంటింటికీ వెళ్లిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



పార్టీలో చేరిన వారితో డిప్యూటీ సీఎం బూడి



వృద్ధురాలితో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం

చీడికాడ: సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఖండివరంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ లబ్ధిని వివరించారు. మురుగునీటి కాలువల నిర్మాణానికి రూ. 20 లక్షల కేటాయించారు. 40 వేల లీటర్ల వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులతో ముచ్చటించారు. సాంకేతిక కారణాలతో నిలిచిన పింఛన్లు అందించాలన్నారు. పలువురు వృద్ధులకు ఆర్థిక సాయమందించారు. నాడు-నేడు పనుల్లో భాగంగా రూ.18 లక్షలతో ఎంపీపీ పాఠశాలలో ఆధునికీకరణ పనుల శిలాఫలకం ఆవిష్కరించారు. సర్పంచ్ శీరంరెడ్డి లక్ష్మి, ఎంపీటీసీ గెంజి స్వాతిబాలాజీ, ఎంపీపీ కురచా జయమ్మ నారాయణమూర్తి, పార్టీ చీడికాడ, దేవరాపల్లి మండలాల అధ్యక్షులు గొల్లవిల్లి రాజుబాబు, బూరె బాబూరావు, చీడికాడ పీఏసీఎస్ అధ్యక్షుడు మోసూరి సన్నిబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, మండల సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య, నాయకులు షేక్ సూర్యనారాయణ, వేచలపు కన్నబాబు, గల్లా ఎర్రినాయుడు, సుంకర వెంకటరావు, చిన్నంనాయుడు, దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం పాల్గొన్నారు.

నేడు ఖండివరంలో...

ఖండివరం పంచాయతీలో మూడో రోజు గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటారన్నారు.

నాలుగు టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

చీడికాడ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన నచ్చి టీడీపీ నుంచి నాలుగు కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. బుధవారం ఖండివరంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు గ్రామానికి చెందిన కొంచ అప్పలనాయుడు, శీరంరెడ్డి చలపతిరావు, పల్లా అప్పలనాయుడు, యాళ్ల రాములు కుటుంబాలకు పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు.

సబ్సిడీపై రోటావేటర్ అందజేత



రోటావేటరుతో ఎంపీపీ లక్ష్మణమూర్తి, రైతులు

నాతవరం: ప్రతి రైతును ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. బుధవారం సరుగుడులో రైతులకు సబ్సిడీపై రోటావేటరు (దుక్కుచేసే) యంత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ వ్యవసాయ యంత్ర సేవా పథకం కింద సబ్సిడీపై ట్రాక్టర్లు, రోటావేటర్లు తదితర పనిముట్లు ఇస్తున్నామన్నారు. ఏవో శైలజ మాట్లాడుతూ నాతవరం ఆర్బీకే పరిధిలో నూకాలమ్మ తల్లి రైతు గ్రూపునకు ట్రాక్టరు అందజేశామన్నారు. డి.యర్రవరం ఆర్బీకే పరిధిలో గణేష్ రైతు గూపునకు ఒక ట్రాక్టరు, ఒక రోటావేటరు, శృంగవరం ఆర్బీకే పరిధిలో పాదాలమ్మ రైతు గ్రూపునకు ఒక రోటావేటరు, సరుగుడు ఆర్బీకే రైతు గ్రూపునకు రోటావేటరు సబ్సిడీపై ఇచ్చామన్నారు. కోటవురట్ల సెంట్రల్ బ్యాంకు సూపర్‌వైజరు ముక్కా అప్పారావు పాల్గొన్నారు.